# గుర్తింపు

ఆ తెల్లారి లేస్తూనే రమణ గుమ్మంలో ప్రత్యక్షం కావడంతో దుర్గాభవాని ఆనందంతో ఉబ్బితబ్బిబై పోయింది. పాతికేళ్ళనాటి చిన్ననాటి స్నేహితుడు అకస్మాత్తుగా రావడంతో ఆనందంతోబాటుగా కంగారు పడిపోయింది.

"దుర్గా! ఎన్నాళ్ళయింది చూసి, మీ ఇద్దరి గురించీ అన్ని సమాచారాలు తెలుస్తున్నప్పటికీ ఇన్నాళ్ళు పట్టింది చూడటానికి" గలగలా మాట్లాడేస్తూ, రెండు మూడుసార్లు కాఫీ తాగేసి ఎక్కడెక్కడి కబుర్లూ పోగేసి రమణ ఇల్లంతా తిరిగేస్తూ హడావిడి చేస్తుంటే దుర్గ ఒక్కసారి అతన్ని ఆపి.

"నువ్వసలు దేశంలోకి ఎప్పుడొచ్చావ్. పోనీ రాగానే ఓ ఫోను కొట్టొచ్చుగా" అంది.

"ఆ... ఆదే అదే నేను రావడమైతే వారం క్రితం వచ్చాను. ఢిల్లీలో దిగాను. మీ నెంబరు ఎలా మిస్సయిందో - నా దగ్గర లేదు. అక్కడెవర్ని అడిగినా అడగచ్చు.."

"ఆ... ఢిల్లీలో మా నెంబరెవరు చెప్తార్లే" అంటూ చిన్నచిన్న పనులు పూర్తిచేసి, పనిమనిషికి కొన్ని పనులు పురమాయించింది.

"అలాగనకు. మీరిద్దరూ క్షేమస్సేకదా! కానీ నాకే కుదరలేదు. ఎలాగూ హైదరాబాద్ రావాలికదా. సరే ఇంతకీ వీడెక్కడికి వెళ్ళాడు.

"విశ్వంని ఎవరో విశాఖపట్నం పిలిచారు. నిన్న రాత్రే విశాఖలో వెళ్ళాడు".

"ఏం మతిస్థిమితంగానే వున్నాడా" అన్నాడు రమణ కొంటెగా...

"అబ్బబ్బ! రమణా నువ్వు ఇండియా వదిలి పాతికేళ్ళయింది. అప్పటికీ ఇప్పటికీ ఇక్కడెంతో మార్పువచ్చింది. నువ్వు మాత్రం ఇంకా డెబ్బైలలోనే వున్నట్టున్నావ్ - అవే జోక్స్ - అదే పాతదనం అమెరికా వెళ్తే ఎదుగుదల ఆగిపోతుందని ఈ మధ్య ఇక్కడి మేధావులు చాలా వాపోతున్నారు. తీరా నిన్ను చూస్తే..." దుర్గాభవాని గట్టిగా నవ్వేసింది. రమణ కూడా ఆమెతో నవ్వుకలిపి-

"నిజమే పాపం ఇప్పుడు మేధావులుగా ముద్ర వేయించుకోవాలంటే ముందుగా అమెరికాని తిట్టాలి" అన్నాడు.

"ఎగ్జాట్లీ" అని తల ఎగరేసింది భవాని.

"ఇంతకీ విశ్వాన్ని వాళ్ళెందుకు పిలిచారు".

"వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం గురించి తేటతెల్లం చేయడానికి."

"పోనీ నువ్వూ వెళ్ళకపోయావా కాస్త వెల్ల డబ్బా మోసేదానివి" వేళాకోళం చేశాడు.

"వద్దులే నాయనా! నాకంత ఓపికా, ఆసక్తీలేవు. వెళ్ళలేదూ, నిన్ను చూశాను."

"అదీ నిజమేలే - వాడ్ని పిలిస్తే నువ్వూ వస్తావని వాళ్ళ వుద్దేశమేమో-"

"ఏమో తెలీదుకానీ కొందరైతే మాటమాత్రంగా కూడా మీరు రండి అనరు".

కార్డుమీద కూడా విశ్వం అని రాసి పడేస్తారు. - ఎవరితోనైనా ఆ మాటంటే ఆయన్ని పిలిస్తే మిమ్మల్ని పిలిచినట్టు కాదా! ఆయన్లో మీరు సగభాగం, పావుభాగం అంటూ (చచ్చుజోక్స్) వాదన చేస్తారు"-

"మన వాళ్ళు అదోరకం".

"ఏదో ఒక రకంలే. నీ కబుర్లు చెప్పు" అంది భవాని. "నీ నవల సీరియలైజ్ అయినప్పుడు చదివాను. చాలా బాగా రాశావు. మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది - కదూ" అన్నాడు రమణ.

"అవును భలే రెస్పాన్స్ వచ్చింది" నేనెంతో ఆనందంగా ఫీలయ్యాను.

"నీ పేరు మా ఫ్రెండ్స్ సర్కిల్లో బాగా పరిచయమై పోయింది."

"థాంక్స్-"

"నువ్వు మా దేశం రావాలి" అన్నాడు రమణ

"ఓహ్. ఈ దేశం నీ దేశం కాకుండా ఎప్పట్నించీ పోయింది".

"జోక్స్‌కాదు. నువ్వు అమెరికా రావాలి. మా యింట్లో మూడు నెలలు మా గెస్ట్‌గా వుండాలి" రమణ మాటలు.

"ఓ... దానికేం అలాగే–" దుర్గాభవాని ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

"ఇంతకీ నీకేమైనా అవార్డులొచ్చాయా" అని అడిగాడు రమణ.

భవాని పకపకా నవ్వుతూ, ప్లేటులో వేసిన పెసరట్టుకి పచ్చడి జోడించి, ముందుకు తోసింది.

"ఎందుకలా నవ్వుతావ్? బోలెడు కథలు రాశావు. మంచివే రాశావు. మంచి నవలలు రాశావు పుస్తకాలు రాశావు. అవి అందరూ మెచ్చుకునేట్టు, కొత్తగా రాశావు. పాతికేళ్లుగా రాస్తూనే వున్నావు. చెప్పుకోడానికైనా ఏదో ఒక అవార్డు వుండాలిగా".

"అబ్బాయి! రమణా! అవన్నీ నిజమే. కానీ అవార్డులు రావడానికీ దానికీ సంబంధం ఏమిటీ – అది వేరు – ఇది వేరు".

రమణ ఆశ్చర్యంగా ఏం మాట్లాడనా అని తెల్లబోయి చూశాడు.

"నేను స్నానం చేసి వస్తాను" అంటూ భవాని లోపలికెళ్ళింది.

దుర్గాభవానీ, రమణ, విశ్వం, ఇంకా ఎమ్మెస్సార్, తులసి అనే అయిదుగురు మంచి స్నేహితులు. ఇంటర్ మీడియట్ నుంచీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసే వరకు కలిసి చదువుకున్నారు. గ్రాడ్యుయేషన్ నుంచీ ఎవరి సబ్జక్టు వాళ్లవే అయినా, వారి స్నేహం పెరుగుతూనే వచ్చింది ఎప్పుడూ వీళ్ళు అయిదుగురూ జట్టుగా కనిపించేవారు.

అందులో విశ్వం, దుర్గాభవానీ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. ఎమ్మెస్సార్ సైన్స్ గ్రూపులో వున్న అమ్మాయిని ప్రేమించి విఫలమయ్యాడు – తులసి పెద్దవాళ్లు చెప్పిన సంబంధం చేసుకుంది. చక్కగా పాడేపాట, సున్నితంగా రాసే కవిత్వం పూర్తిగా మర్చిపోయి వుండిపోయింది.

రమణ మాత్రం అమెరికా అవకాశం అంది పుచ్చుకుని వెళ్ళిపోయాడు. నాలుగేళ్లు వంటరిగా డబ్బు సంపాదించుకుని, వచ్చి పెళ్ళి చేసుకుని మళ్ళీ వెళ్ళిపోయాడు. అక్కడే ఆనందంగా స్థిరపడిపోయాడు.

అయితే ఈ అయిదుగురి స్నేహానికి గట్టిబంధం వారికున్న సాహిత్యాభిలాషే కళల పట్ల వారికున్న ఇష్టం, అభిమానం, ఆరాధనా వారి సన్నిహితత్వానికి మూలం.

అయిదుగురూ కవిత్వం రాయడం, పాటలు పాడటం కథలు రాసి చదివి వినిపించుకోవడం, నాటకాలు వేయడం, రాయడం, ఒకటేమిటి? అన్నీ చేస్తూ ఫైన్ ఆర్ట్స్ గ్రూపులా గర్వంగా తలలెగరేస్తూ తిరిగేవారు.

అందరూ అన్నీ చేసినా, టాలెంట్‌లో హెచ్చుతగ్గులు సహజంగా వుండేవి కనుక, ఎవరు మంచిది రాసినా అందరూ ఆనంద పడేవారు. భుజానేసుకుని

తిరిగేవారు. అందరికంటే తక్కువ రాస్తూ, ఎక్కువ విమర్శించే పాత్ర రమణది అందుకే అతను ఆ నలుగురి పాలిటా ఓ పెద్ద క్రిటిక్ - విమర్శకుడికి ఉండవలసిన మంచి గుణాల గురించీ, విషయ పరిజ్ఞానం గురించి, పదునైన విమర్శగురంచి, కువిమర్శ, కుళ్లు విమర్శ అంటూ వాళ్ళ మధ్య పెద్దపెద్ద చర్చలు సాగుతూండేవి.

అందరూ తలొక చోటకీ వెళ్ళిపోయి విడిపోయినా, అప్పుడప్పుడు వుత్తరాలు, ఫోను పిలుపులు, శుభలేఖలు సాగుతూనే వున్నాయి. వాళ్ళున్న వూర్లు వెళ్ళినప్పుడు కలుసుకుని రాత్రిళ్ళు కబుర్లు కాలక్షేపం సర్వసాధారణం.

ఇన్నేళ్ళ తర్వాత వచ్చిన రమణలో శారీరకంగా వచ్చిన మార్పేగానీ మరేం కనిపించక దుర్గాభవాని ఆశ్చర్యపోయింది.

"అసలు నీ పేరే పాత చింతకాయ పచ్చడిలా వుంది. అదొక డ్రాబాక్" అన్నాడు రమణ వున్నట్టుంది.

"అదేమిటి? నాది అసలు సిసలు అచ్చమైన తెలుగుపేరు - అయినా నా పేరు నా పేరే - ఏమైందిప్పుడు" అంది భవానీ పౌరుషంగా.

"ఏం కాలేదులే - పేరు పాతదైనా, పేరు తెచ్చుకున్నావు" అన్నాడు.

"చాలా థాంక్స్" మూతి విరిచింది భవాని.

"కానీ - ఇలా పబ్లిక్‌లో వుండేవాళ్ళకి కాస్త - స్టైల్ కావాలి. నలుగురి దృష్టినీ ఆకర్షించే స్టైల్, ఫ్యాషన్ వుండాలి"-

"ఓ... ఏమిటో ఇంతకీ నీ గోల?"

"గోల కాదు గోలీ - పోనీ నీ వేషం - అదీ కాస్త ఆధునికంగా వుంటుందా అంటే అదీ లేదు. ఏదో చీర చుట్టబెట్టుకుంటావు. వంకర టింకర జడ - ఈ మధ్య కాస్త మ్యాచింగ్ జాకెట్టు వేస్తున్నట్టున్నావు".

"అబ్బబ్బ! ఏమిటి నాయినా నీ వాగుడూ"

"ఎలా వుండాలో చెప్తాను. ముందు జుట్టు విరబోసుకోవాలి - అది అందంగా మెరుస్తూ వుండేలా చూసుకోవాలి-, అయ్యో నీ ముఖం పొడుగ్గా దోసకాయలా వుంటే బాగుండేది - అలా వుంటే కనుబొమ్మలు గీకేసుకుని వికృతంగా అవి దిద్దుకుని - బొట్టూ అప్పుడప్పుడు పెట్టుకుని లేనప్పుడు మానేయవచ్చు-, వారం రోజులు ఫ్రిజ్‌లో పెట్టిన దోసకాయ చర్మం వడిలినట్లు, ముఖం వడిలితే బాగా మేకప్ చేసుకుని, షర్టూ ఫ్యాంటూ, లేకపోతే కనీసం చుడీదార్‌లాంటివి వేసుకుని ముద్దుముద్దుగా మాట్లాడుతూ, జుట్టు వెనకి తోసుకుంటూ స్టైల్ చెయ్యాలి."

"రమణా! ఎంత దుర్మార్గంగా తయారయ్యావు".

"దుర్మార్గం ఏముంది? రచనదేముంది. నువ్వే చెయ్యాలని కూడా లేదు - రచయిత్రి స్టైల్‌గా వుంటే వెంట పడి రాసి పెట్టే మగాళ్ళు బోలెడు మంది వుంటారు. ఇప్పుడు చూడటం లేదూ!"

"చాల్లే! నోరు మూసుకో".

"మూసుకుంటాలే గానీ - నేను చెప్పినట్టుగా ఇప్పుడు ఆంధ్రదేశంలో వాతావరణం లేదంటావా".

"నాకనవసరం".

"ఓకే- ఇంతకీ అసలు విషయానికొద్దాం".

"నీకు స్త్రీల పట్ల ఇంత చులకన భావం ఎప్పట్నించి - ఛీ! నాకెంత బాధగా వుందో".

"నాకు స్త్రీల పట్ల బోలెడంత గౌరవం వుంది. కానీ ఈ దొంగ దారులూ, పట్టివేత కార్యక్రమాలూ చాలా అసహ్యం. మీ రచయిత్రులలో ఎవరైనా అలా వుంటే వారంటే అసహ్యం. సమాజం పట్ల ఎంతో బాధ్యతగా వుండాల్సిన రచయిత (త్రి)లలో నిజాయితీ ఆత్మగౌరవం లోపిస్తే క్షమించలేను"-

దుర్గాభవాని అవాక్కయిపోయింది.

"సరేలే - నీకు అవార్డు లేమీరాలేదంటే నాకు తెలిసినొకాయన గొప్ప సలహా యిచ్చాడు. ఆయనిచ్చిన సలహా ఈ నాటి తెలుగు సాహితీలోకం తీరుతెన్నులకు గీటురాయి" అని అడిగాడు రమణ.

"ఏమిటా సలహా" అంది కీచుగొంతుతో.

"అవార్డుల గురించే"

"అయినా ఈ పురస్కారాల గోలేమిటి?"

"బాగుంది. ప్రతిభకి గుర్తింపు అవార్డు కాక మరేమిటో చెప్పుచూద్దాం."

భవానీ వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

అసలు పి. ఆర్. అనేది లేకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్టు రాసుకుపోతూ వుంటే పేరూ వుండదు. ప్రయోజనమూ వుండదు".

"రమణా నువ్వెందుకిలా మాట్లాడుతున్నావో నా కర్థం కావడం లేదు".

"ఓ పేరున్న వాళ్ళకి ఒక పుస్తకం అంకితమిచ్చి ఎక్కడెక్కడ ఎలాంటి అవార్డులున్నాయో తెలుసుకుంటూ వుండాలి. అవసరం వచ్చినప్పుడల్లా కాస్త కదిలిస్తూ

వుండాలి. – ఇప్పుడు అవార్డులొచ్చిన వారందరి గురించీ, ఆ యిచ్చిన వాళ్ళకి తెలుసుననుకుంటున్నావా – అంతా రికమెండేషన్ వల్లనే ఇస్తారు."

"ఏమిటి బాబూ అమెరికాలో వుండి ఆంధ్రదేశంలోని సంగతులన్నీ కాచి వడబోసినట్లు చెప్తున్నావు".

"ఆంధ్రదేశం మాటేమోగానీ హైద్రాబాద్ గురించి మాకు బాగా తెలుసు. ఇక్కడ మబ్బు వేస్తే అక్కడ మాకు చల్లగాలి తిరుగుతుంది".

"చాల్లే! కబుర్లు బాగా చెప్తావ్!"

"సర్లే నువ్వూరుకో. నేనే ఒక మంచి ముహూర్తం చూసి పదిమందిని పోగేసి ఒక సభ చేసి నీ పుస్తకానికో అవార్డు, మంచిది చూసి ఎనౌన్స్ చేస్తాను. దానితో బాటుగా, కథా గండుకోయిలనో, నవలా బొండు మల్లియ' అనో బిరుదు కూడా యిప్పిస్తాను. కాస్త పెద్ద మనుష్యుల్ని ఇందులో ఇన్వాల్వ్‌చేసి పబ్లిసిటీ యిప్పిస్తే సరి. – కాకపోతే ఓ పదివేలు ఖర్చు అవుతుంది. అయితే ఏం? ఆ విధంగా ఒకటి రెండు అవార్డులు, ఆ సందర్భంగా ఇంటర్వ్యూలు, అభిప్రాయాలు చెప్పుట, సందేశాలిచ్చుట చేస్తే – అబ్బో! ఇంక చెప్పేదేముంది?

దుర్గాభవాని నోరెళ్ళబెట్టి చూస్తుండిపోయింది. రమణలోంచి వేరే మనిషి బయటకొచ్చి మాట్లాడుతున్నట్లనిపించింది. ఆమె గొంతులో తడారిపోయినట్లని పించింది.

"రమణా! నువ్వెంత మారిపోయావు. నీకిలాంటి అభిప్రాయాలున్నాయా?"

"ఉన్నాయని ఎవరు చెప్పారు. నా, నీ శ్రేయోభిలాషి సలహా యిచ్చారని చెప్పాగా"

"అంటే–"

"అంటే లేదు గింటే లేదు. మరిలోకం ఎలా వుంటే అలాగే నడవాలని అంతా అంటారు కదా" రమణ ఆగాడు.

దుర్గాభవానీ నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టింది. నువ్వు నీ గురించీ, నా గురించీ ఏమనుకుంటున్నావో నా కర్థం కావడం లేదు. నేను చెప్పేది శ్రద్ధగా విను.

నేను అవార్డులు, సన్మానాలు ప్రశంసా పత్రాల మీద ఎప్పుడూ ఆసక్తి చూపలేదు. – నాకస్సలు ఆ ధ్యాసలేదు. నువ్వు చెప్పినట్లు, పోనీ నీ మిత్రుడు సూచించినట్టు వ్యాపార సరళి వల్ల, రాజకీయం వల్ల అవార్డులు, పురస్కారాలు లభించటం వల్లనే

వాటికి గౌరవం లేకుండా పోయింది. జన్యూయన్‌గా వచ్చిన వారు కూడా అవమానంగా భావించే స్థితి వచ్చింది.

అవార్డు వచ్చిన వారి గురించి, వెనక్కి తిరిగి అంతా "ఏముందని అవార్డు" అని చెప్పుకోవడం చెప్పినవారికీ, విన్నవారికీ కూడా అవమానంగా వుంది. ఆ విధంగా నా గురించి అనుకోవడం నా కిష్టం లేదు. పూర్వం ఎన్నో గొప్ప పుస్తకాలు రాసిన ఎందరో రచయితలకి ఏం అవార్డులు వచ్చాయని మనం ఈ నాటికీ వారి రచనలు శిరోధార్యంగా భావిస్తున్నాం. వందేళ్ళ నాటి రచన ఈనాటికీ నిత్యనూతనంగా వుండటం చూస్తున్నాం. ఎన్నో బహుమతులు పొందినప్పటికీ కలికంలోకి లేకుండా పోయిన వాళ్ళనీ చూస్తున్నాం. నా కలాంటి దుస్థితి వద్దు. ఒకవేళ నా రచనల్లో నిజంగా సత్తాలేకపోతే అవి చచ్చిపోవడమే ధర్మం వాటినేలాగో బతికించాలని నాకనిపించదు".

రమణ నిశ్శబ్దంగా దుర్గాభవానీ మాటలు వింటూ కూర్చుండిపోయాడు. "నీ ఫ్రెండ్స్ నా రచనలు చదివి బాగున్నాయన్నారన్నావు కదా! ఆ బలం చాలు నన్ను నువ్వు రమ్మని పిలవడానికి- నేనేలాగూ నీ గెస్టునే" రమణ నెమ్మదిగా నవ్వాడు. ఆ నవ్వులో కించిత్ గర్వం తొణికసలాడింది.

ఆ రాత్రి వెళ్ళిపోతూ "మళ్ళీ ఫోనులో పిలుస్తానని విశ్వంతో చెప్పు" అన్నాడు.

దుర్గాభవానీకి రమణ మాట్లాడిన ఎన్నో మాటలు చెవుల్లో, గుండెల్లో బుర్రలో తిరుగుతున్నాయి. గొంతులోచేదుగా ఒక అసహ్యం-

నిద్రంతా కలతగానే సాగింది.

ఫోను మోగుతుంటే విశ్వం అనుకుని పరుగెట్టి అందుకుంది. కానీ విశ్వం కాదు.

"ఎవరూ దుర్గాభవానీయేనా" ఆ కంఠం పరిచయమైనదే-

"ఆ... నేనే నమస్కారమండీ"

"బాగున్నారామ్మా - మొన్న మీ కథ చదివాను చాలా బాగా రాశారు. ఈ వూరు వచ్చాను. మీకా మాట చెప్దామనే పొద్దునే ఫోను చేస్తున్నా..."

ఇంకా ఏవేవో విశేషాలు, కబుర్లు మాట్లాడి ఆయన ఫోను పెట్టేశారు.

ఆయన కథల మాస్టారు

దుర్గాభవానీకి ఏదో పెద్ద అవార్డు అందుకున్న ఆనందానుభూతి కలిగింది.

(డిసెంబర్ 2001, 'పత్రిక')